క్లుప్తంగా

బీరప్ప పండుగ.. ఎల్లమ్మకు బోనాలు



గ్రామ దేవతలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధి మల్కీజ్‌గూడ గ్రామంలో పక్షం రోజులుగా పండుగ వాతావరణం నెలకొంది. కుర్మ కులస్తులు బీరప్ప పండుగను ఘనంగా నిర్వహించారు. 15 కుటుంబాలున్న కుర్మలు.. రూ.లక్షలు వెచ్చించి వైభవంగా జరుపుకొంటున్నారు. ఆదివారం ఎల్లమ్మ, మార్కమ్మకు గ్రామస్తులు బోనం ఎత్తగా.. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

సీసీ కెమెరాల బహూకరణ



పోలీసులకు కెమెరాలు అందిస్తున్న విక్రంరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చెన్నంపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన కల్లు విక్రంరెడ్డి ముందుకు వచ్చారు. ఈ మేరకు ఆదివారం పోలీసు స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన నాలుగు సీసీ కెమెరాలను పోలీసులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు రమణ, తిరుపతయ్య, విజేందర్, శ్రీధర్, కృష్ణ, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



తరలి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం నగరంలోని గాంధీభవన్‌కు తరలివెళ్లారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి.. బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రాములు, రాష్ట్ర నాయకుడు రవీందర్ నాయక్, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, ఖాదర్, రచ్చ శ్రీరాములు, నాజర్, వెంకటేశ్, మైసయ్య, రఫీ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన షాబుద్దీన్



విజయశాంతిని సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ విజయశాంతిని, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ పరంగా నిర్వహించబోయే కార్యక్రమాల గురించి చర్చించినట్లు షాబుద్దీన్ తెలిపారు. ఆయన వెంట శ్రీకాంత్, విజేందర్ ఉన్నారు.

కాలనీల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

- టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి
- అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటన

మీర్‌పేట: కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్, ఆదిత్యనగర్, టీఆర్ఆర్ టౌన్‌షిప్, సాయినగర్, ఎన్‌టీఆర్‌కాలనీ, లలితానగర్, విజయహోమ్స్, రాఘవేంద్రనగర్ ఫేజ్–1, 2, న్యూగాయత్రీనగర్, దేవీగాయత్రీనగర్, శ్రీధర్‌కాలనీ, బాలాజీనగర్‌లో ఆదివారం ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల దశరథ, పాండుగౌడ్, కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాంబశివరావు, ప్రభాకర్‌రావు, రాజేశ్వర్‌రావు, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

పరిష్కారం దొరికేనా?



యాచారం తహసీల్దార్ కార్యాలయం

రైతు సంక్షేమమే లక్ష్యం. వారి భూ సమస్యల పరిష్కారమే ధ్యేయమని ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తున్నాయి. అందులో భాగంగా గత ప్రభుత్వం ధరణి అమలు చేయగా.. ఆశించిన ఫలితాలు రాలేదు. దాని స్థానంలో ప్రస్తుత సర్కార్.. భూభారతి చట్టం తెచ్చింది. సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది.

భూ సమస్యలతో రైతుల సతమతం

- దశాబ్దాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- యాచారం మండలంలో కదలని 2 వేల దస్త్రాలు!
- రేపటి నుంచి భూభారతి సదస్సులు
- అలసిన బతుకుల్లో చిగురిస్తున్న ఆశలు

యాచారం: ప్రభుత్వాలు, పాలకులు మారుతూనే ఉన్నారు. రెవెన్యూ రికార్డులు పోయి, డిజిటల్ రూపంలో ధరణి వచ్చింది. దాని స్థానంలో భూభారతి చట్టం ప్రవేశించింది. కానీ రైతుల భూ సమస్యలు ఎప్పటిలాగే ఉన్నాయి. ప్రభుత్వం ఏదైనా, పాలకులు ఎవరైనా సరే.. పైరవీలు చేసి, అధికారులకు ముడుపులు చెల్లిస్తే ఆ ఫైళ్లు చకాచకా కదులుతాయని, అవి చేయలేని రైతులు.. ఏళ్లుగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేదనే ఆరోపణలు లేకపోలేదు. సమస్యలు తీరక, తిరిగే ఓపిక లేని మట్టిబిడ్డలు.. తమ భూములను వచ్చిన ధరకు అమ్ముకునే దుస్థితి నెలకొంది

2 వేలకు పైగా..

యాచారం మండల పరిధి 24 గ్రామాల్లో సుమారు 2 వేలకు పైగా భూ సమస్యలు ఉన్నాయి. పేద రైతులంతా మీ సేవల్లో రూ.వేలు ఫీజులు చెల్లించి దరఖాస్తులు చేసుకుంటున్నారు. దాంతో పాటే పనులు వదులుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా.. పైరవీకారుల దస్త్రాలపై దృష్టి సారిస్తున్న అధికారులు.. పేద రైతుల గురించి పట్టించు కోవడం లేదు!. ఏవో సాకులు చూపి రిజక్ట్ చేస్తున్నారని, సమయంలో కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. యాచారం, మొగుళ్లవంపు, మొండిగౌరెల్లి, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, మాల్, నల్లవెల్లి, నస్దిక్‌సింగారం, మల్కీజ్‌గూడ గ్రామాల్లో ఇలాంటి బాధితులు అనేకంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో తెచ్చిన ధరణి స్థానంలో, కాంగ్రెస్ సర్కార్ భూభారతి చట్టాన్ని తెచ్చిందని, ఇప్పుడైనా తమ సమస్యలు తీరేనాని కర్షకులు ఎదురు చూస్తున్నారు.

రేపటి నుంచి భూభారతి

మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. రెండు టీంలుగా తహసీల్దార్ అయ్యప్ప, ఉప తహసీల్దార్ కీర్తి సాగర్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. 3న మంతన్‌గౌడ్, చౌదర్‌పల్లి, 4న మంతన్‌గౌరెల్లి, నస్దిక్‌సింగారం, 5న మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, 6న చింతపట్ల, మల్కీజ్‌గూడ, 9న నల్లవెల్లి, చింతుల్ల, 10న మాల్, కొత్తపల్లి, 11న గునుగల్, నందివనపర్తి, 12న గడ్డమల్లయ్యగూడ, అయ్యవారిగూడెం, 13న యాచారం, నక్కర్త, 16న మొగుళ్లవంపు, మేడిపల్లి, 17న తాడిపర్తి, నానక్‌నగర్, 18న కుర్మిద్ద గ్రామాల్లో నిర్వహించనున్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

తహసీల్దార్ షేక్ ముంతాజ్

కడ్తాల్: భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తహసీల్దార్ షేక్ ముంతాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు టీములుగా కార్యక్రమం చేపట్టనున్నామని, ఒక టీంకు తాను, మరో టీంనకు డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య రాజు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ఏ రోజు ఎక్కడ?

తహసీల్దార్ షేక్ ముంతాజ్ ఆధ్వర్యంలో 3న మక్తమాధారం, 4న వాస్‌దేవ్‌పూర్, 5న రావిచేడ్, 9న నాగిరెడ్డిగూడ, 10న సాలార్‌పూర్, 11న టాక్‌రాజ్‌గూడ, 16న కడ్తాల్, 17న కడ్తాల్ గ్రామాల్లో జరగనుంది. డీటీ ఆదిత్యరాజు ఆధ్వర్యంలో 3న న్యామతాపూర్, 4న వంపుగూడ, 4న చల్లంపల్లి, 9న చరికొండ, 10న ఎక్‌రాజ్‌గూడ, 11న ముద్వీన్, 12న ముద్వీన్, 13న కర్కల్ పహాడ్‌లో సదస్సులు నిర్వహించనున్నారు.

మంచాలలో 20 వరకు



వెంకట ప్రసాద్, తహసీల్దార్

మంచాల: భూ సమస్యల పరిష్కారం కోసం రేపటి నుంచి 20వ తేదీ వరకు మండల పరిధి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తహసీల్దార్ వెంకట ప్రసాద్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల వారీగా 3న చీదేడు, తిప్పాయిగూడ, 4న దాద్‌పల్లి, చిత్తాపూర్, 5న రంగాపూర్, తాళ్లపల్లిగూడ, 6న నల్లచెరువు, బోడకొండ(కొర్రంతండా), 9న బోడకొండ(ఎల్లమ్మతండా), లింగంపల్లి, 10న సభిత్‌నగర్, జాపాల, 11న మనోహరాబాద్, ఆస్మత్‌పూర్, 12న చాంద్‌ఖాన్‌గూడ, నోముల, 13న లోయపల్లి, మల్లికార్జునగూడ, 16న శ్రీమంత్‌గూడ, మంచాల, 17న ఆరుట్ల, జైనమ్మగూడ, 18న ఆరుట్ల, ఆగాపల్లి, 19న ఆరుట్ల, కాగజ్‌ఘట్, 20న బండలేమూర్‌లో సదస్సులు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

కేజీబీవీలో ఇంటర్ విద్య

- ప్రస్తుత సంవత్సరం ప్రారంభం
- దరఖాస్తులకు ఆహ్వానం



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

కడ్తాల్: నిరుపేద బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా పాఠశాలల స్థాయిని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పదో తరగతి అనంతరం విద్యార్థినుల ఉన్నత విద్యకు ఆటంకం కలగకుండా ఇంటర్ తరగతుల ప్రారంభానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది.

అద్దెభవనంలో ప్రారంభమై..

మండల కేంద్రంలో 2017– 18 విద్యా సంవత్సరంలో 6,7,8 తరగతులతో అద్దెభవనంలో కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం) ప్రారంభమైంది. ఏటా తరగతులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నూతన భవనం నిర్మించింది. అందులోనే గతేడాది నుంచి తరగతులను కొనసాగిస్తోంది. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో.. కేజీబీవీని 2025– 26 ఏడాదికి ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఇంటర్ విద్య ప్రారంభం కానుంది. ఆ దిశగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు

కస్తూర్బాలో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధించనున్నారు. గ్రూపులు బైపీసీ, ఎంపీసీలు కాగా.. ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉండనున్నాయి. దీంతో పేద విద్యార్థునులకు మరింత బాసట కానుంది. ఉన్నత విద్యను చదివేందుకు దోహదపడనుంది.

వినియోగించుకోండి



కేజీబీవీలో ఈ ఏడాది నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభిస్తాం. దీంతో విద్యార్థినుల చదువు మధ్యలో ఆగకుండా ఉంటుంది. నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. నిరుపేద బాలికలకు ప్రాధాన్యత ఉంటుంది. సద్వినియోగం చేసుకోవాలి.

– అనిత, ఎస్‌ఓ, కేజీబీవీ, కడ్తాల్

అంబలి కేంద్రానికి అపూర్వ ఆదరణ



సందడిగా అంబలి కేంద్రం

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొనసాగుతున్న అంబలి కేంద్రానికి అపూర్వ ఆదరణ లభిస్తోందని క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. అంబలి కేంద్రాన్ని ఆదివారం క్లబ్ సభ్యులతో కలిసి సందర్శించి మాట్లాడారు. ఫిబ్రవరి 12న ఈ కేంద్రాన్ని ప్రారంభించామని, అది ఈ నెల 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. 120 రోజులుగా.. రోజుకు 400 మందికి రాగి అంబలిని అందజేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, నాయకులు బీచ్యానాయక్, జహంగీర్‌అలీ, చేగూరి వెంకటేశ్, మహేశ్, ముత్తికృష్ణ, జావీద్, ఇమ్రాన్, గౌస్, శివ, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ముడిమ్యాల గ్రామంలో ఆదివారం 18 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చే ప్రతీ ఒక్కరికి మొదటి విడుతలో ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగంగా కొనసాగుతోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్, రాములు పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజ్



గ్రామ పంచాయతీ వర్కర్లతో బాల్‌రాజ్

కందుకూరు: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రాచులూరులో గ్రామ పంచాయతీ వర్కర్లతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానంతో ప్రతి ఒక్క వర్కర్‌కు రూ.9500 ప్రభుత్వం చెల్లిస్తుందని, అందులో నుంచి రూ.7వేలు మాత్రమే వారికి అందుతున్నాయని పేర్కొన్నారు. మిగతా డబ్బులను మల్టీపర్పస్ లేని గ్రామాల్లో ఆరు సంవత్సరాలుగా పని చేస్తున్న ఇతర వర్కర్లకు చెల్లిస్తున్నారన్నారు. మరి కొంత మంది స్వీపర్లకు కేవలం రూ.3 వేలు ఇస్తున్నారని, పంచాయతీ కార్మికులకు రూ.26వేల చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎంపీకి ఘన స్వాగతం



కడ్తాల్: మల్లురవిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు/ కడ్తాల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవికి కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ నాయకులు ఘన స్వాగతం పలికారు. పీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా నియమితులై, ఆదివారం ఢిల్లీ నుంచి నగరానికి చేరుకున్న ఎంపీకి శంషాబాద్‌లో పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు కేశవులు, మంగ్లీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, జగన్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆమనగల్లులో..

పీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా ఎంపికైన ఎంపీ డాక్టర్ మల్లురవికి శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములు, గూడురు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ఖాదర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఆహ్వానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మండల పరిధి చిన్నవేములోని బావితండాకు చెందిన శ్రీనిధి ఫౌండేషన్ అధ్యక్షుడు, వ్యాపారవేత్త దేపావత్ రవినాయక్, నాయకులు వినోద్‌నాయక్, అఖిల్‌నాయక్ తదితరులు బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, దేశ రక్షణకు ఆయన చేస్తున్న కృషిని చూసి పార్టీలో చేరామని పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్ నాయక్, రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, రెడ్యా, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీశైలంగౌడ్, రాందాస్‌నాయక్, యాదగిరి, కుమార్, శ్రీను, విక్రాంత్, వెంకటేశ్‌గౌడ్, లక్ష్మణ్, జంగయ్య ఉన్నారు.

నేడు విష్ణు సహస్రనామ మహాయజ్ఞం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ రామదూత ఆశ్రమంలో సోమవారం 130వ శ్రీ విష్ణుసహస్రనామ మహాయజ్ఞం, నిత్య శుద్ధానందగిరి స్వామి చతుర్థ పుణ్య ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఆశ్రమ వ్యవస్థాపకులు శివానందస్వామి, బ్రహ్మశ్రీ రేవల్లి రాజుశర్మల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఉదయం సుప్రభాతం, జ్యోతి ప్రజ్వలన, భగవద్గీత పారాయణం, విష్ణుసహస్రనామ మహాయజ్ఞం, మహాత్ముల ప్రవచనాల అనంతరం పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కందుకూరు: మహేశ్వరం మండల పరిధిలోని అమీర్‌పేటలో విశ్వకర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విశ్వకర్మ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు వడ్ల కుమారచారి, ఉపాధ్యక్షుడు ఏ.వెంకటాచారి మాట్లాడుతూ.. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా వాటి నుంచి దూరంగా ఉంచాలన్నారు. అదేవిధంగా పిల్లలకు గౌరవ, మర్యాదలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు అందరిపైన ఉందన్నారు. విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, కోశాధికారి ఆర్.శేఖర్‌చారి, ప్రచార కార్యదర్శి బాలాచారి, మోహనాచారి, సలహాదారులు శీనయ్యాచారి, మల్లేశ్‌చారి, కనకాచారి ఉన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం!

- అతిథి గృహానికి నోచుకోని ఆమనగల్లు
- పునరుద్ధరణ మరిచిన అటవీశాఖ



మావోలు పేల్చివేసిన అటవీశాఖ అతిథిగృహం

ఆమనగల్లు: అతిథిగృహ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. నాలుగు మండలాల కూడలిగా హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న ఆమనగల్లు పట్టణంలో గెస్ట్‌హౌస్ లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో అటవీశాఖ కార్యాలయ ఆవరణలోని నిజాం కాలంనాటి అతిథిగృహం ఎన్నో సేవలు అందించింది. అయితే రెండున్నర దశాబ్దాల క్రితం ఆ గృహాన్ని మావోయిస్టులు పేల్చివేశారు. ఆ తరువాత అటవీశాఖ.. దానిని పునరుద్ధరిస్తున్నామని ప్రకటించినప్పటికీ.. నేటికీ కార్యరూపం దాల్చలేదు.

తహసిల్ కార్యాలయంలో వసతి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో, గతంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆర్అండ్‌బీ శాఖ లేదా ఇతర శాఖల ఆధ్వర్యంలో గెస్ట్‌హౌస్ నిర్మించాలని పలుమార్లు తీర్మానాలు చేశారు. అయినప్పటికీ నిర్మాణం జరగలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. దీంతో ప్రముఖులు వచ్చినప్పుడు సేదతీరడానికి ఇబ్బంది అవుతోంది. గెస్ట్‌హౌస్ లేని కారణంగా ఇటీవల భూభారతి సదస్సుకు హాజరైన కలెక్టర్‌కు.. తహసిల్దార్ కార్యాలయంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని అతిథిగృహ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తీర్మానించాం..



ఆమనగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పట్టణంలో అతిథిగృహం నిర్మించాలని పలుమార్లు తీర్మానించాం. అయినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించాలని ప్రతిపాదనలు పంపినా చర్యలు శూన్యం.

– అనురాధ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు

'వికాసం' ఎవరికి దక్కేనో

- రుణం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు
- పూర్తయిన గుర్తింపు ప్రక్రియ
- నేటి నుంచి మంజూరు పత్రాల అందజేత!



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కడ్తాల్: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం' పథకానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా అర్హులకు రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేయనుంది. ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు అందజేసి.. ఆర్థిక స్వావలంబన దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ప్రోత్సహించనుంది. ఇందులో భాగంగా మార్చి 15నుంచి దరఖాస్తులు స్వీకరించింది.

1758 అర్జీలు..

యువ వికాసం పథకానికి మండల పరిధి 24 గ్రామ పంచాయతీలతో పాటు, అనుబంధ గ్రామాల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఓబీఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారి నుంచి పంచాయతీ, మండల పరిషత్ అధికారులు దరఖాస్తుకు సంబంధించిన హార్డ్‌కాపీలతో పాటు, ధ్రువ పత్రాలు తీసుకున్నారు. మొత్తం 1758 అర్జీలు రాగా.. వాటిని గ్రామాలతో పాటు, వర్గాల వారీగా విభజించారు. అందులో అర్హులను గుర్తించి, జూన్ 2 నుంచి 9 వరకు రుణ మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. రుణాలు ఎవరికి వరించెనో అని అర్జీదారులు ఎదురు చూస్తున్నారు.

సిబిల్ స్కోర్ పరిశీలనకు..

అందిన దరఖాస్తులను అధికార యంత్రాంగం ప్రాథమిక పరిశీలన చేసింది. రేషన్‌కార్డు ఉందా, స్థానికంగా ఉంటున్నారా, గతంలో మరేదైనా స్కీంలో లబ్ధిపొందారా అనే తదితర వివరాలను ఆరాతీసి, పరిశీలిస్తున్నారు. పరిశీలన అనంతరం ఆయా కార్పొరేషన్ స్కీంల ఆధారంగా విభజించి, సంబంధిత దరఖాస్తులను సిబిల్ స్కోర్ పరిశీలనకు సమీప బ్యాంకులకు పంపిచారు.

కడ్తాల్ మండలంలో వచ్చిన దరఖాస్తులు

కులం	దరఖాస్తులు
ఎస్సీ	357
ఎస్టీ	541
బీసీ	718
ఈబీసీ	5
మైనార్టీ.	134
క్రిస్టియన్ మైనార్టీ	3
మొత్తం	1758

అర్హత ఉన్నవారికా?

రాజీవ్ యువ వికాస్ పథకం గురించి దరఖాస్తుదారుల్లో ఆతృత నెలకొంది. రాజకీయ నాయకుల అండదండలు ఉన్నవారికే రుణం మంజూరవుతుందా, లేక ప్రాథమిక అర్హతను బట్టి కేటాయిస్తారా అనే అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరు అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. అర్హుల జాబితాలో తమ పేర్లు ఉండేలా చూడాలని వేడుకుంటున్నట్లు సమాచారం. కాగా.. సిబిల్ స్కోర్ ఆధారంగానే బ్యాంకర్లు రుణం మంజూరు చేస్తారేమోననే సందేహం పలువురు వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం నేటి నుంచి 9వ తేదీ వరకు రుణాలను అందించేందుకు సిద్ధం కాగా!.. ఎంతమందికి 'వికాసం' వరిస్తుందో చూడాలి.